
బస్సు కోసం వెయిట్ చేయబట్టి గంట దాటుతోంది. నేనొచ్చేముందే వరుసగా ఓ అరడజను బస్సులు వెళ్ళిపోయాయని, అందులో నాలుగు పోస్టాఫీసుకెళ్ళేవేనని చెప్పేడు అక్కడి కిళ్ళీ బడ్డీవాడు. వాడి దగ్గర ఓ రెండు 'టీ'లు త్రాగడం, ఓ అర పెట్టె సిగరెట్లు కాల్చడం అయ్యాయి నే నెళ్ళే బస్సు వచ్చేలోపల.

# దొంగ... దొంగ...

-మంత్రవాది మహేశ్వర్



టైము ఆరుగంటలవుతోంది.

విపరీతమైన రద్దీతో వచ్చాగింది నంబరు పత్నాలుగు. ఎలాగో ఒకలా లోపలికి దూరాను. ఏం పట్టుకోక పోయినా ఫరవాలేదు. పడిపోను అనిపించింది. కాళ్ళు కూడా క్రింద ఆనుతున్నాయో లేదో- అనుమానమే. టి.ఐ.సి. పాయింట్ దగ్గరికొచ్చేసరికి కండక్టర్ గట్టిగా అరిచాడు- "ముందు చెకింగ్ అవుతోంది. అందరి దగ్గరా టిక్కెట్లుండాలి"- ఆమాట వినేసరికి ఓ అరడజను మంది దిగిపోయారు సడన్‌గా... కాస్త ఖాళీ ఏర్పడింది... ఊపిరి పీల్చుకున్నాను. బస్సులో ఒకడు మరొకడిని తోసేశాడని ఓ యుద్ధం.

వాళ్ళు తిట్టుకోవడం పోయి వాళ్ళకి జన్మనిచ్చిన తల్లి తండ్రుల్ని తిట్టుకోవడం ప్రారంభించేరు.

"ఏమిటయ్యా ఈ గొడవ... పోనీయండి రద్దీగా వున్నప్పుడు తగలకుండా ఎలా వుంటారు" అన్నారు కొందరు ముందు నుంచి వెనుక నుంచి.

అయినా దెబ్బలాట తగ్గుస్థాయిలో కొనసాగుతోంది.

ఆ దెబ్బలాడుతున్న వారిలో ఒకతనితో నీలం చొక్కా వేసుకున్న ఓ పాతికేళ్ళ యువకుడు "మీరిలాగే పోట్లాడకోవడంలో పడి మిమ్మల్ని మీరు మరచిపోతారు. చూడు జేబులోంచి డబ్బు ఎలా కనిపిస్తోందో... జేబుదొంగలకదే అవకాశం" అని అతని జేబుకేసి చూపించాడు. పది రూపాయిల నోటును సర్దుకున్నాడు అతను.

మరుసటి రోజు-

అదే సమయం- అదే బస్సు.

నా బ్యాక్ పాకెట్‌కు ఎవరిదో చేయి తగిలింది. నేను కాస్త సర్దుకుని చూసుకునే సరికే అయిదొందల రూపాయిలు మాయం... సరిగ్గా స్టేజీ వచ్చేస్తోంది.

అంటే-

గట్టిగా అరిచాను. "దొంగ...దొంగ కండక్టరు బస్సు ఆపు చేయి. ఎవరూ దిగడానికి వీల్లేదు. నావి అయిదొందలు పోయాయి. అన్నీ క్రొత్త వంద రూపాయిల నోట్లు. ఇదిగో పాస్ బుక్ బ్యాంక్‌కు వెడుతున్నాను"

బస్సాగింది-

కండక్టరు ముందు గేటు దగ్గర... నేను వెనుక గేటు దగ్గర... డ్రైవరు కూడా దిగి నా దగ్గరికి వచ్చాడు... అందర్నీ చెక్ చేద్దామనుకుంటున్నాం.

అంతే-

"ఇవేనా సార్" అంటూ ఓ వ్యక్తి నలిగి పడి వున్న అయిదొందల్ని అందించాడు.

ఆశ్చర్యం వేసింది నాకు! అవెలా వచ్చాయి?

అతని చేతిలోంచి తీసుకున్నాను... ఎక్కడో చూసినట్టు గుర్తు అతనిని...ఆ నిన్న ఇదే బస్సులో నీలం చొక్కా వ్యక్తి...

ఇందాక నా వెనకాలే భయం భయంగా నిలబడింది... ఇతనే...

అయితే దొంగ దొరకలేదు. డబ్బు దొరికింది... బస్సు కదిలింది. ●

# కథ చెప్పిన నిజం

—"రారాజు"

టాక్సీ వెంటనే అర్జెంటుగా ఏర్పాటు చెయ్యవలసి వచ్చింది. నారాయణరావుకి సీరియస్‌గా వుంది. ఊళ్ళో పంట పొలాల దగ్గర సరిహద్దు తగవుల్లో దెబ్బలాటలు గాయాలు తగిలాయి.

అర్జెంటుగాబట్టి టాక్సీ మూడు వందలకు తక్కువ రానన్నాడు. తప్పలేదు. ఉన్నపళంగా పట్టణంలో పేరు పొందిన ధర్మాసుపత్రికి వచ్చారు.

డాక్టర్లకి, ఆసుపత్రి సిబ్బందికి చెల్లించవలసిన ముడుపులు చెల్లించారు. వార్డ్ బోయ్ చాలా సహాయం చేస్తున్నాడు.

నారాయణరావుని ఆసుపత్రిలో చేర్చుకున్నారు. వైద్యం చేస్తున్నారు. సెలైను ఎక్కించారు. ఇంజక్షన్లు ఇచ్చారు. మందులిచ్చారు. కట్లు కట్టారు.

ఆక్సిజన్ ఎక్కించవలసి వచ్చింది. అప్పుడే ఆఖరి ఆక్సిజన్ సిలెండరు మరో రోగికి మరో వార్డులో వాడడంవల్ల స్టాక్ లేవు. వెంటనే బయట నుంచి తెప్పించారు. ఆక్సిజన్ కనెక్షన్లు ఇచ్చారు.

బంధువులు "పర్వాలేదంటారా? డాక్టరుగారు" అని అడిగారు.

"మీరు టైముకి తీసుకొచ్చారు. సక్రమంగా జరగవలసినవన్నీ జరిగిపోయినియ్యి. ఏం పర్వాలేదు" అన్నారు డాక్టరు.

బంధువులకి అప్పుడు కాస్త దడ తగ్గింది. "అమ్మయ్యా"! అని కాస్త గాలి పీల్చుకున్నారు. ప్రొద్దుటి నుంచి భోజనం ఎలాగూ లేదు. అసలే రాత్రి పొద్దుపోయింది. ఈ రాత్రి పూట కూడా భోజనం చెయ్యలేదు. కాస్త మొహాల మీద నవ్వు కనిపించింది.



వార్డ్ బోయ్ కూడా నవ్వాడు. బంధువులు ఇక పడుకున్నారు.

మధ్యలో ఒకాయన నిద్రలేచి నారాయణరావు దగ్గరకెళ్ళి చూశారు. కొద్దిగా కదులుతున్నాడు. ఆక్సిజన్ పీలుస్తున్నాడు. ఆయన వచ్చి నిద్రపోయారు.

తెలతెలవారుతోంది. కాకులు కూస్తున్నాయ్. రోగుల బాధలు, మూలుగులు, దగ్గులు వినిపిస్తున్నాయ్.

కాని నారాయణరావు కదలడం లేదు. మూలగడం లేదు. ఊపిరి పీల్చడం లేదు.

అందరూ లబో దిబో మన్నారు.

డాక్టరుతో చెప్పారు. ఆయన ఆశ్చర్యపోయారు.

"నా ప్రయత్నం నేను చేశాను. విధియే అనుకూలించ లేదు." అని చెప్పి తప్పించుకున్నారు.

ఆస్పత్రి దగ్గర రెండు టాక్సీలు గుంట నక్కల్లా కాచుకుని వున్నాయి. ఈసారి శవాన్ని వూరు తీసుకుని వెళ్ళడానికి పదిహేను వందలు డిమాండ్ చేశారు. అయినా తప్పలేదు.

టాక్సీవాడు వెళ్ళి వూళ్ళో దింపేసి వచ్చి స్టాండులో నుంచున్నాడు.

వార్డు బోయ్ వచ్చి డ్రైవర్‌ని కలిసాడు.

డ్రైవర్ మూడొందలు చేతిలో పెట్టాడు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఇంకా ఏమైనా ఆక్సిజన్ కేసులున్నాయా?" అన్నాడు డ్రైవర్.

"లేవు వుంటే చెప్తానులే" అన్నాడు వార్డు బోయ్.

శవానికి సవారీ టాక్సీవాలా కడితే, శవం కావడానికి ఆక్సిజన్ కనెక్షన్ తీసేయవలసింది వార్డుబోయ్. ●